సాక్షి
జనగామ

శుక్రవారం | 3 | జనవరి | 2025



దీప్తి.. ఘన కీర్తి - 8లో ▸

పారా అథ్లెట్ జీవాంజి దీప్తి ఘన కీర్తి సాధించారు. దేశంలోనే ప్రతిష్టాత్మక అర్జున అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 17న రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకోనున్నారు.



అభివృద్ధిలో టెక్నాలజీ భాగం

అభివృద్ధిలో టెక్నాలజీ భాగమైందని, టెక్నాలజీని అందిపుచ్చుకుని కంపెనీ అభివృద్ధిలో ముందుకెళ్తోందని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి అన్నారు. - 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $28^0/13^0$

జిల్లాలో ఉదయం చలి ఎక్కువగా ఉంటుంది. రోజంతా ఎండతోపాటు చల్లటి వాతావరణం ఉంటుంది. రాత్రి ఎక్కువగా పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పోలీస్ కమిషనర్‌ను కలిసిన ఏఎస్పీ



జనగామ: జనగామ డివిజన్‌లో నూతనంగా ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పండరి చేతన్ నితిన్ గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందించారు. మహారాష్ట్రకు చెందిన పండరి చేతన్.. కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి 2022 సంవత్సరంలో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వహిస్తున్న చేతన్.. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జనగామకు వచ్చారు.

4న బ్రెయిలీ జయంతి వేడుకలు

జనగామ రూరల్: లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా మహిళాశిశు సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 4న వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి ఫ్లోరెన్స్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అంధులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన



జనగామ రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరెట్ ఎదుట చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులు వినూత్న రీతిలో గురువారం తమ నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ కేబినెట్ మంత్రుల ఫొటోలతో కూడిన మాస్కులు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని గత 24 రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు తాడూరి రమేశ్, కార్యదర్శి దయాకర్‌గౌడ్, మహిళ అధ్యక్షురాలు శ్రీలత, కోశాధికారి రవీందర్‌రెడ్డి, యాదగిరి, నరేశ్, హరిప్రసాద్, శ్యామల, మంజుల, సరిత, అనిత, సునిత, అరుణ, నజియా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వర్గీకరణకు అన్ని వర్గాల మద్దతు



రఘునాథపల్లి: వర్గీకరణకు అన్ని వర్గాలు మద్దతుగా నిలిచాయని, మాలలు కలిసి రావాలని మాదిగ కళాకారుల రాష్ట్ర కోఆర్డినేటర్ మచ్చ దేవేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్స్‌లో ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు సుంచు సురేందర్‌మాదిగ అధ్యక్షతన జరిగిన ఎమ్మార్పీఎస్, అనుబంధాల సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుప్రీం కోర్టు రాజ్యాంగ విస్తృత ధర్మాసనం, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యవాదులందరూ అనుకూలంగా ఉన్న విషయం తెలిసి కూడా కొంత మంది స్వార్థపరులు తమ కుటుంబ ప్రయోజనాల కోసం వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 7న మహాజన నేత మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు వేల గొంతుకలు లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్లేష్‌మాదిగ, కుమార్, సుధాకర్, అబ్బయ్య, శ్రీనివాస్, నర్సిరెడ్డి, మహేందర్, ఉదయ్‌కిరణ్, దయాకర్, రవి, నవీన్ పాల్గొన్నారు.

బదిలీలపై నిషేధం

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో మే 31వ తేదీ వరకు బదిలీలపై నిషేధం విధిస్తున్నట్లు సింగరేణి డైరెక్టర్(పా) వెంకటేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను సింగరేణి యాజమాన్యం 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని విధించగా డిసెంబర్ వరకు 46.30 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు తెలిపారు. మిగిలిన ఉత్పత్తిని సాధించేందుకు యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

నేతన్నల ఖాతాల్లో థ్రిఫ్ట్

- ముగిసిన పథకం
- 2,750 మంది అకౌంట్లలో రూ.14 కోట్ల నిధులు
- పునఃప్రారంభానికి ప్రయత్నం
- కార్మికుల ఎదురుచూపులు



బచ్చన్నపేట మండలం గోపాల్‌నగర్‌లో మగ్గం నేస్తున్న కార్మికుడు

జనగామ: చేనేత కార్మికుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన నేతన్నకు చేయూత పథకం (తెలంగాణ హ్యాండ్‌లూమ్ వీవర్స్ థ్రిఫ్ట్ ఫండ్ సేవింగ్ అండ్ సెక్యూరిటీ స్కీం) కాలపరిమితి గత ఏడాది ముగిసింది. ఇందులో కాటన్ దుస్తులు తయారు చేసే కార్మికుల నెలసరి ఆదాయం రూ.8 నుంచి రూ. 10వేలు, సిల్క్ చీరల తయారీ కార్మికుల నెలసరి ఆదాయం రూ.12వేల నుంచి 15వేల వరకు లెక్కించి కార్మికులు పొదుపు ఎంత చేసుకోవాలనే నిబంధనలు విధించారు. ఈ లెక్కన నేత కార్మికులు తమ ఆదాయంలో 8 శాతం పొదుపు చేసుకుంటే, ప్రభుత్వం 16శాతం (రెండింతలు) పొదుపు చేసి మూడేళ్ల తర్వాత ఆ మొత్తం సొమ్ము చెల్లిస్తుంది. చేనేత ఉత్పత్తుల అమ్మకాలు నిలిచిపోవడంతోపాటు నూలు దిగుమతి లేక, మరమగ్గాలు పని చేయని పరిస్థితుల్లో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొనేందుకు థ్రిఫ్ట్ పథకం భరోసా కల్పిస్తోంది.

జిల్లాలో 2,750 మంది కార్మికులు

జిల్లా వ్యాప్తంగా జియో ట్యాగింగ్ చేసిన నేత, అనుబంధ, లెర్నింగ్ కార్మికులు 2,750 మంది ఉండగా.. వీటి పరిధిలో లేని వారు మరో 500మంది ఉంటారు. 2017 జూలై 24న యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లిలో మొదటిసారిగా నేతన్నకు చేయూత



పథకం తిరిగి ప్రారంభించాలని ఎదురు చూస్తున్న నేత కార్మికులు

పేరుతో ఈ థ్రిఫ్ట్ పథకాన్ని అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. రెండోసారి 2022 ఆగస్టు 7న ఈ స్కీంను కంటిన్యూ చేయగా, గత ఏడాది ఆగస్టు మాసంలో క్లోజ్ చేశారు. నేతన్నకు చేయూత పథకం కాలపరిమితి 36 నెలలు. దీని ఆధారంగా జియో ట్యాగింగ్ పరిధిలో ఉన్న ఒక్కో కార్మికుడు ఆదాయాన్ని బట్టి రూ.600 నుంచి రూ.1,200



వరకు ప్రతి నెలా ఈ స్కీంలో జమ చేసుకున్నారు. 36 నెలల పాటు నేత కార్మికులు జమ చేసుకున్న డబ్బులకు ప్రభుత్వం రెండింతలు కలిపి ఆ మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం రూ.14కోట్ల నిధులు విడుదల చేసింది.

పథకం పునఃప్రారంభానికి కసరత్తు

థ్రిఫ్ట్ పథకాన్ని పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. విధి విధానాలలు పాతవే కంటిన్యూ చేస్తారా.. ఏమైనా మార్పులు చేస్తారా.. అనే వివరాలను వెల్లడించాల్సి ఉంది.

థ్రిఫ్ట్‌ను మరోసారి అమలు చేయాలి



చేనేత కార్మికులకు భరోసా కల్పిస్తున్న థ్రిఫ్ట్ పథకాన్ని మరోసారి అమలు చేయాలి. నెలకు రూ.1,200 చొప్పున 33 నెలలపాటు జమ చేసిన ప్రభుత్వం.. నెలనెలా రూ.2,400 డిపాజిట్ చేసింది. పథకాన్ని క్లోజ్ చేయడంతో రూ.79,200 నగదు నా ఖాతాలో జమ అయింది.

-మంగళంపల్లి కృష్ణమూర్తి, గోపాల్ నగర్, బచ్చన్నపేట

రూ.1.22లక్షలు వచ్చాయి



నేతన్నకు చేయూత పథకంలో 34 నెలల పాటు నెలకు రూ.1,200 చొప్పున జమ చేసుకున్నా. ప్రభుత్వం 16శాతం లెక్కన ప్రతి నెలా రూ.2,400 కలుపుకుని, చివరకు రూ.1.22లక్షలను అందించింది. ఈ డబ్బులతో వృత్తిని మరింత అభివృద్ధి చేసుకుంటా.

- ఏల శేఖర్, వీవర్స్ కాలనీ, జనగామ

బడ్జెట్ రిలీజ్



జిల్లాలో 2,750 మంది నేత కార్మికులు జియో ట్యాగింగ్ పరిధిలో ఉన్నారు. వీరంతా తమ ఆదాయాన్ని బట్టి నేతన్నకు చేయూత పథకంలో జమ చేసుకున్నారు. పథకం కాలపరిమితి ముగియడంతో ప్రభుత్వం తన వాటా కింద రెండింతల చొప్పున కలిపి బడ్జెట్ రిలీజ్ చేసింది. కార్మికుల అకౌంట్లలో ఈ డబ్బులు జమ అవుతున్నాయి.

- చౌడేశ్వరి, ఏడీ, చేనేత, జౌళిశాఖ, జనగామ

ఆరోపణలు పట్టించుకోను..

- అభివృద్ధి చేసి చూపిస్తా..
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మల్కాపూర్‌లో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న కడియం

చిల్పూరు: అభివృద్ధి చేయనోళ్లు ఆరోపణలు చేస్తూనే ఉంటారని అవేమి తాను పట్టించుకోనని.. ప్రజలు కోరిన విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపెడుతానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లెలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ పోరెడ్డి బుచ్చిరెడ్డి నివాసంలో గురువారం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. తన హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఆ తర్వాత వచ్చిన నాయకులు కేవలం అవినీతి అక్రమాలకు పాల్పడుతూ వారే అభివృద్ధి చెందారే తప్ప నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. అలాంటి వారు ఇప్పుడు రోజుకో ప్రెస్‌మీట్ పెట్టి ఆరోపణలు చేసినా పట్టించుకోనన్నారు. కల్వకుంట కుటుంబం కటకటాల పాలయ్యే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ముఖాముఖి ద్వారా గ్రామంలోని 12 సమస్యలను తన దృష్టికి తీసుకురాగా.. ఈఏడాది చివరి వరకు 6 పనులు చేస్తానని హామీ ఇచ్చారు. అందులో గ్రామ పంచాయతీ నూతన భవనానికి రూ. 20 లక్షలు, ఎగువ ప్రాంతం వ్యవసాయానికి సాగునీరు అందించేందుకు 4రోజుల్లో ఎత్తిపోతల అప్-1-2 పనులను ప్రారంభించి వచ్చే వానాకాలం వరకు సాగునీరు అందిస్తానన్నారు. మల్కాపూర్ పీహెచ్‌సీని 24 గంటలు విధులు ఉండేలా చర్యలు తీసుకుంటానని, అసంపూర్తిగా ఉన్న మహిళా కమ్యూనిటీ భవనం పూర్తికి ఎంపీ నిధులు మంజూరు చేయిస్తానన్నారు. గ్రామానికి 500 మీటర్ల సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లను అదనంగా 100 మంజూరు చేయిస్తానన్నారు. అభివృద్ధిలో అందరి సహకారం అవసరమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎడవెల్లి మల్లారెడ్డి, పుల్యాల నారాయణరెడ్డి, యశ్వంతరెడ్డి, కొంగరి రవి, నామాల మల్లేశం, పసుల వెంకటేశ్, వెన్నం రవీందర్‌రెడ్డి, ఊరడి సతీశ్, కనుకతార, పోషయ్య, కట్ట బీరప్ప, రాసూరి రాజు తదితరులు ఉన్నారు.

చలికి వణుకుతున్న ప్రజలు

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు



బచ్చన్నపేటలో చలిమంటచుట్టూ చేరిన ప్రజలు

బచ్చన్నపేట: గత రెండు రోజులుగా రాత్రి వేళ వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఉష్ణోగ్రతలు పడిపోయి ప్రజలు చలికి వణుకుతున్నారు. రాత్రి వేళ, ఉదయం పూట చలి మంటలను వేసుకొని కాగుతున్నారు. బయటకు వెళ్లాలంటే రగ్గులను కప్పుకొని, జర్కిన్‌లను వేసుకోక తప్పడం లేదు. వృద్ధులు, చిన్నపిల్లల పరిస్థితి మరీదారుణం. ఉదయం పూట భారీగా మంచు కురుస్తుండడంతో వాహనాదారులకు దారి కానరాక ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలకు హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. వ్యవసాయదారులు పొగమంచులోనే పనుల్లో నిమగ్నమవుతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

దుప్పట్లు, నోటు బుక్కులు ఇవ్వండి



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా ఉన్నతాధికారులు



కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

- జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందించాలి
- కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ

జనగామ: కొత్త సంవత్సరంలో జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రతీ ఒక్కరు తోడ్పాటును అందించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్, జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టరేట్ ఏఓ మన్సూరి, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, తహసీల్దార్లు, వివిధ సంఘాల బాధ్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు.. కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అయితే శుభాకాంక్షలు తెలిపే సమయంలో పుష్పగుచ్ఛాలు, శాలువాలకు బదులుగా విద్యార్థులకు అవసరమయ్యే నోటు బుక్కులు, స్టేషనరీ, దుప్పట్లు అందించాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ పిలుపునకు విశేష స్పందన వచ్చింది. కలెక్టర్.. తాను స్వీకరించిన వస్తువులను సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా జనగామ నూతన ఏఎస్పీ పండేరి చేతన నితిన్ కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆర్డీఓ వెంకన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హనుమాన్ నాయక్, బీసీ సంక్షేమ అధికారి రవీందర్, జీసీడీఓ గౌసియా బేగం, రామారావు నాయక్, స్వరూప, కొర్నేలియస్, రమేశ్, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో ఉద్యోగులే కీలకం


- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- టీఎన్జీఓ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ



టీఎన్జీఓ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, యూనియన్ బాధ్యులు

జనగామ: జిల్లా అభివృద్ధి, సంక్షేమంలో ఉద్యోగులే కీలకమనికలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఖాజా షరీఫ్ తదితరులతో కలిసి కలెక్టర్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 2025 సంవత్సరంలో ఉద్యోగులు కష్టపడుతూ అభివృద్ధి, సంక్షేమంలో జిల్లాను రాష్ట్రంలోనే ముందువరుసలో ఉంచేలా పని చేయాలన్నారు. అనంతరం టీఎన్జీఓ అధ్యక్షుడు ఖాజా షరీఫ్ మాట్లాడారు. ఇదిలాఉండగా.. టీఎన్జీఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన పేర్వారం ప్రభాకర్‌ను కలెక్టర్ శాలువాతో సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు జిల్లా కార్యదర్శి పెండెల శ్రీనివాస్, రాజనర్సయ్య, హాఫిజ్, సంపత్ కుమార్, ఉప్పలయ్య, జ్యోతి, శ్రీధర్ బాబు, పాషా, అరుణ, అబ్బసాయిలు, నాగార్జున్, కృష్ణ, విష్ణు, అరుణ, నరేష్, యుగందర్, పర్వ రాములు, రాజేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

కొడకండ్ల: తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్ష వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గోదుమల కుమారస్వామి కోరారు. గురువారం మండలకేంద్రంలో ఉద్యమకారులు మహ్మద్ నసీరుద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు. తాము ప్రవేశ పెట్టిన 13 డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించి నేరవేర్చాలన్నారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను నేరవేర్చేవరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల అకాంక్ష వేదిక మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా నసీరుద్దీన్, ఉపాధ్యక్షులుగా కై రోజు సత్యనారాయణ, విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూక్య శ్రీను, కార్యదర్శిగా మేకల రమేశ్, సంయుక్త కార్యదర్శిగా సోమన్న కోశాధికారిగా ఉపేందర్, పబ్లిసిటీ కార్యదర్శిగా షన్నా, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఉపేందర్, లింగన్న, యాకన్న, చీఫ్ అడ్వైజర్‌గా విశ్వనాధుల జ్ఞానేశ్వరచారి, సభ్యులుగా ధర్మ, భిక్షం, రామ్మూర్తిని ఎన్నుకున్నారు.

భూగర్భ జల పన్ను

వాణిజ్య అవసరాలకు తప్పనిసరి

- లైసెన్స్.. నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిందే
- గృహ, వ్యవసాయ అవసరాలకు మినహాయింపు
- నిబంధనల అమలులో అధికారుల జాప్యం
- ప్రతి జిల్లాలో ఏడుగురు సభ్యులతో విజిలెన్స్ కమిటీ



22 సంస్థలకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ..

హనుమకొండ జిల్లాలో పరిశ్రమలు, హాస్పిటళ్లు, హోటళ్లు, రైస్‌మిల్లులు, ఇతర ప్యాకేజ్డ్ వాటర్ సప్లయర్స్ వంటి వాణిజ్య సంస్థలు ప్రస్తుతానికి 400 వరకు ఉన్నట్లుగా భూగర్భ జల శాఖ అధికారులు తెలిపారు. 22 సంస్థలకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేశారు.

హన్మకొండ:

విస్తరిస్తున్న నగరాలు, పట్టణాలు.. పెరుగుతున్న జనాభా అవసరాల నిమిత్తం భూగర్భ జలాల వినియోగం రోజురోజుకూ అధికమవుతోంది. తాగునీరు వ్యాపార వస్తువుగా మారిపోయింది. విచ్చల విడిగా బోర్లు వేసి నీటిని తోడుతున్నారు. ఫలితంగా భూగర్భంలో నీరు అడుగంటి వందలాది అడుగుల లోతుకు వెళ్తోంది. ఈ నేపథ్యంలో భూగర్భ జలాల వెలికితీతను నియంత్రించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. వాల్టా చట్టాన్ని అనుసరించి తెలంగాణ స్టేట్ గ్రౌండ్ వాటర్ ఎక్స్‌ట్రాక్షన్ రూల్స్–23ను తీసుకొచ్చింది. దీని ప్రకారం.. వాణిజ్య అవసరాలకు వినియోగించే నీటికి పన్ను చెల్లించాలి. లైసెన్స్‌తో పాటు జిల్లా భూగర్భ జల శాఖ ద్వారా నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఈ నిబంధనల అమలులో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల భూగర్భ జల శాఖ అధికారులు తెలంగాణ రాష్ట్ర భూగర్భ జలాల వెలికితీత నియమాలపై అవగాహన కల్పిస్తున్నారు.

దృష్టి సారించని అధికారులు

2023 సంవత్సరం నెలలో ఈ నియమాలు వచ్చిన ప్పటికీ.. ఇటీవలి వరకు అధికారులు శ్రద్ధ పెట్టకపోవడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు అమలుకు నోచుకోలేదు. నగర, పట్టణ ప్రాంతాల్లో వాణిజ్య అవసరాలకు నీటిని విచ్చలవిడిగా వినియోగిస్తున్నా.. పర్యవేక్షించిన సందర్భాలు కనిపించలేదు. భూగర్భ జలాల నియంత్రణకు విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేసి నియంత్రించాల్సి ఉండగా.. ఆ దిశగా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కడా జీఓఎంఎస్ 15 అమలు జరగడం లేదని తెలుస్తోంది.

వీటికి మినహాయింపు..

తాగు నీరు, గృహ అవసరాల కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యక్తిగత వినియోగదారులకు, గ్రామీణ తాగు నీటి సరఫరా పథకాలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు, వ్యవసాయ అవసరాలకు పన్ను నుంచి మినహాయింపు ఇచ్చారు.

అతిక్రమిస్తే జరిమానా..

నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం వాణిజ్య సంస్థలు వాటి వినియోగ సామర్థ్యాన్ని బట్టి రూ.14,500 నుంచి రూ.42వేల వరకు రెన్యూవల్‌కు రూ.10 వేలు, మైనింగ్ ప్రాజెక్టులు కొత్తగా, రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకునేందుకు రూ.1 లక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ షరతులు ఉల్లంఘిస్తే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. కాగా.. భూగర్భ జలాల వినియోగాన్ని బట్టి ఆయా సంస్థలు ప్రభుత్వానికి ఎక్స్‌ట్రాక్షన్ చార్జీలు చెల్లించాలి. వీటిని నాలుగు కేటగిరీలుగా విభజించారు. నిబంధనలు అతిక్రమించిన వాణిజ్య కేంద్రాలు కేటగిరీల వారీగా ప్రభుత్వం విధించిన జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. కాగా.. భూగర్భ జలాల అక్రమ వెలికితీత, రవాణాకు వినియోగించే యంత్రాలు, వాహనాలను సీజ్ చేసేందుకు విజిలెన్స్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈకమిటీలో అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ), సంబంధిత మండల తహసీల్దార్, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా భూగర్భ జలశాఖ అధికారి, కలెక్టర్‌చే నామినేట్ చేసిన వ్యక్తులు సభ్యులుగా ఉంటారు.

పన్ను వేటికంటే..

పరిశ్రమలు, వాణిజ్య సంస్థలైన ఆస్పత్రులు, షాపింగ్‌మాళ్లు, హోటళ్ల వంటివి, అధిక నీరు వినియోగించే అపార్టుమెంట్లు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్లు, మైనింగ్ ప్రాజెక్టులు, బల్క్ వాటర్ సప్లయర్లు, నిర్దేశిత ఫారమ్‌లో ఆన్‌లైన్‌లో సంబంధిత జిల్లా భూగర్భ జలశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. రోజుకు 20 వేల లీటర్లకుపైగా భూగర్భజలాలు వాడుకునే అపార్ట్‌మెంట్లు, హౌసింగ్ సొసైటీలు మురుగు నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలి. శుద్ధి చేసిన నీటిని టాయిలెట్ ఫ్లషింగ్, కార్ వాషింగ్, గార్డెనింగ్‌కు వినియోగించుకోవాలి. వాణిజ్య అవసరాలకు భూగర్భ జలాలు వినియోగించుకునే సంస్థలు, పరిశ్రమలు డిజిటల్ వాటర్ ఫ్లో మీటర్‌ను బిగించుకోవాలి. ఈమీటర్‌ను పరిశీలిస్తూ డేటాను భూగర్భ జలశాఖకు సమర్పించాలి. ప్యాకేజ్డ్, బల్క్ నీటి సరఫరా చేసే వాహనాలు జీపీఎస్ అమర్చుకోవాలి.

అవగాహన కల్పిస్తున్నాం..



భూగర్భ జలాల నియంత్రణ, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీపై వాణిజ్య సంస్థలకు అవగాహన కల్పిస్తున్నాం. కచ్చితంగా ఎన్ఓసీ తీసుకోవాలని వివరిస్తున్నాం. వాణిజ్య సంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలు అర్థం చేసుకుంటున్నాయి. నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకునేందుకు ముందుకొస్తున్నారు. వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు గుర్తించే ప్రక్రియ, తనిఖీలు కొనసాగుతున్నాయి.

- సీహెచ్.శైలశ్రీ మల్లికాదేవి, జిల్లా భూగర్భ జలశాఖ అధికారి, హనుమకొండ

సెమిస్టర్ ఫలితాల విడుదల



కేయూ క్యాంపస్: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలకు సంబంధించి బీఏ, బీకాం, బీఎస్సీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు గురువారం కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ కె.శ్రీనివాస్, సి.రాజిరెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

నెమళ్ల కనువిందు

- జూపార్క్‌లో బయట తిరుగుతున్న మయూరాలు
- ఘర్షణ ఆపడానికే బయటకు వదిలాం.. జూపార్క్ ఇన్‌చార్జ్



న్యూశాయంపేట: హనుమకొండ హంటర్‌రోడ్‌లోని జూపార్క్‌లో నెమళ్లు తిరుగుతూ సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. ఎన్‌క్లోజర్స్‌లో ఉండాల్సిన నెమళ్లు.. మొసళ్ల ఆవాసం ఉండే ప్రాంతం పక్కన చెట్ల పొదల్లో తచ్చాడుతుండగా సాయంత్రం వేళ 'సాక్షి' కెమెరాకు చిక్కాయి. అధికారుల నిర్లక్ష్యంతో నెమళ్లు బయట తిరుగుతున్నాయని, పార్క్ బయటకు వెళ్తే వేటగాళ్ల ఉచ్చులో పడి బలైపోతాయని జంతు ప్రేమికులు అంటున్నారు. కాగా, ఈ విషయంపై జూపార్క్ ఇన్‌చార్జి, ఎఫ్‌ఆర్‌ఓ మయూరిని వివరణ అడగగా రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా బయట నుంచి తీసుకొచ్చిన నెమళ్లు ఎన్‌క్లోజర్స్‌లో ఉంచితే కొత్త, పాత పక్షులు ఘర్షణ పడుతాయని, వాటి రక్షణ కోసం తామే పార్క్ చెట్ల పొదల మధ్య వదిలామని తెలిపారు. బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సీఈగా చైతన్యకుమార్



ఉత్తర్వులు అందుకుంటున్న చైతన్యకుమార్

కేసముద్రం: రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సీఈగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాపుర్యాతండాజీపీకి చెందిన చైతన్య కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. తండాకు చెందిన ఎం. చైతన్యకుమార్ 1994లో వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేసి ఎన్నో ప్రశంసలు, అవార్డులు అందుకున్నట్లు తండావాసులు తెలిపారు.కాగా, చైతన్యకుమార్ నియామకంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేయూలో హాస్టల్ నుంచి విద్యార్థి సస్పెన్షన్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతున్న హెచ్‌ఆర్‌ఎం విభాగం సెకండియర్ విద్యార్థి గత నెల 31న న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మద్యం సేవించి జగ్జీవన్ రామ్ హాస్టల్‌కు వెళ్లి న్యూసెన్స్ చేశాడు. అంతేగాకుండా అక్కడ ఎంకామ్ సెకండియర్ విద్యార్థిపై దాడికి పాల్పడ్డాడు. ఈ వ్యవహారం అప్పుడే పెట్రోలింగ్ చేస్తున్న పోలీసుల దృష్టికి వెళ్లడంతో న్యూసెన్స్ చేస్తున్న విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చారని సమాచారం. ఈ ఘటనపై గురువారం కేయూ హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ బాధిత ఎంకామ్ విద్యార్థితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఈ ఘటనను రిజిస్ట్రార్ మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. న్యూసెన్స్ చేసి, విద్యార్థిపైదాడికి పాల్పడిన హెచ్‌ఆర్‌ఎం విద్యార్థిని నాలుగువారాల పాటు హాస్టల్‌నుంచి సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసినట్లు హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఆ ఉత్తర్వులను యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌కు, ఆవిభాగం అధిపతికి కూడా పంపామని రాజ్‌కుమార్ తెలిపారు.

పతకాలు సాధించిన హనుమకొండ జిల్లా రెజ్లర్లతో డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్, అసోసియేషన్ బాధ్యులు



మూడు విడతల్లో పోటీలు..

రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు మూడు విడతల్లో నిర్వహించగా విజేతలకు ఎప్పటికప్పుడు పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. మొదటి విడతలో డిసెంబర్ 19వ తేదీన జిమ్నాస్టిక్స్ పోటీలు ప్రారంభమై 22వ తేదీ వరకు కొనసాగాయి. అనంతరం రెండో విడతలో డిసెంబర్ 27వ తేదీన హ్యాండ్‌బాల్, సెపక్‌తక్రా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం కాగా 30వ తేదీన ముగిశాయి. చివరి విడత డిసెంబర్ 31నుంచి జనవరి 2వ తేదీ వరకు రెజ్లింగ్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు జరిగాయి.

సంగ్రామం.. సమాప్తం

- ముగిసిన సీఎంకప్ క్రీడా పండుగ
- 14 రోజులు.. 6 క్రీడాంశాల్లో పోటీలు
- రెజ్లింగ్‌లో ఆతిథ్య వరంగల్ జిల్లాకు ఏడు పతకాలు
- అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్ భద్రాద్రికొత్తగూడెం

అథ్లెటిక్స్‌లో నువ్వా?నేనా..

నువ్వా?నేనా అన్నట్లు సాగిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం 33 జిల్లాల అథ్లెట్లు పోటీపడగా 86 పాయింట్లతో భద్రాద్రి కొత్తగూడెం ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. తర్వాత 62 పాయింట్లతో రెండో స్థానంలో ఖమ్మం జిల్లా అథ్లెట్లు నిలిచారు. 46 పాయింట్లతో మూడో స్థానాన్ని హైదరాబాద్ దక్కించుకుంది.

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 14 రోజులు కొనసాగిన సీఎం కప్ క్రీడా పండుగ గురువారం సాయంత్రం ముగిసింది. ఆరు క్రీడాంశాలలో నిర్వహించిన పోటీల్లో తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 4వేలపై చిలుకు క్రీడాకారులతో పాటు టెక్నికల్ అఫీషియల్స్ హాజరైనట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ వెల్లడించారు.

రెజ్లింగ్‌లో ఏడు పతకాలు..

ముగింపు వేడుకలకు సీఎం ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రెజ్లింగ్, అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన రెజ్లింగ్ పోటీల్లో హనుమకొండ క్రీడాకారులు ప్రతిభ చాటి ఏడు పతకాలను కైవసం చేసుకున్నారు. సబ్‌జూనియర్స్ 60కేజీల విభాగంలో వి. గణేశ్, 53 కేజీల కేటగిరీలో బి. అంజలి, 48 కేజీల విభాగాల్లో గోల్డ్ మెడల్ సాధించారు. ఎస్. అరుజన్‌సాగర్ కాంస్య పతకం సాధించారు. జూనియర్ బాలికల విభాగంలో 50కేజీల బి. ప్రణవి, 59 కేజీల లోకె చిన్ని, 61 కేజీల కొర్ర అఖిల్ స్వర్ణ పతకాలు సాధించగా, 57కేజీల విభాగంలో ఎ. రాహుల్ రజత పతకం సాధించాడు. విజేతలను హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్ కుమార్, తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, వరంగల్, హనుమకొండ జిల్లాల రెజ్లింగ్ అసోసియేషన్ల కార్యదర్శులు సుధాకర్, షేక్‌రియాజ్, రెజ్లింగ్ కోచ్‌లు కె.రాజు, ఎం. జైపాల్ అభినందించారు.

అభివృద్ధిలో టెక్నాలజీ భాగం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



సీఎండీ వరుణ్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇన్‌చార్జ్ డైరెక్టర్లు

హన్మకొండ: అభివృద్ధిలో టెక్నాలజీ భాగమైందని, ఈ టెక్నాలజీని అందిపుచ్చుకుని కంపెనీ అభివృద్ధిలో ముందుకెళ్తోందని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ వరుణ్ రెడ్డిని డైరెక్టర్లు, ఆయా అసోసియేషన్, సంఘాల నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్పీడీసీఎల్‌లో ఇప్పటికే సాంకేతికంగా ఎన్నో మార్పులు తీసుకువచ్చామని, భవిష్యత్‌లో కూడా టెక్నాలజీ పరంగా చాలా అభివృద్ధి ఉంటుందని వివరించారు. ప్రతీ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌పై 1912 టోల్ ఫ్రీ నంబర్ ముద్రించి విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతీ ఉద్యోగి నిబద్ధతతో విధులు నిర్వర్తించి కంపెనీ మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, సదర్ లాల్,వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు అశోక్, బీకంసింగ్, కె.ఎస్.గుట్ట, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

హసన్‌పర్తి : న్యూయర్ వేడుకల పేరిట మహిళా హాస్టల్‌లో న్యూసెన్స్‌చేయడమే కాకుండా విద్యార్థులపై దాడి చేసిన ఘటనలో నమోదైన కేసులో నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న హాస్టల్ నిర్వాహకుడి కుమారుడు సాయి కౌశిక్‌తోపాటు మరో ముగ్గురు యువకులను పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా మంగళవారం రాత్రి గుండ్లసింగారం సమీపంలోని సరస్వతి మహిళా హాస్టల్‌పై అంతస్తులో సాయి కౌశిక్‌తో పాటు మరో ముగ్గురు విద్యార్థులు అతిగా మద్యం తాగి అసభ్యకరంగా ప్రవర్తించారు. ఈమేరకు విద్యార్థినుల ఫోన్ ద్వారా ఇచ్చిన సమాచారం మేరకు సమీపంలోని హాస్టల్‌లో ఉంటున్న బి.టెక్ విద్యార్థులు అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు చేరుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. మరుసటి రోజు కూడా గొడవ జరిగింది. రాత్రి వచ్చిన విద్యార్థులను పిలిచి వారిపై దాడి చేశారు. ఈ ఘటనపై విద్యార్థుల ఫిర్యాదు మేరకు పోలీసులు సాయి కౌశిక్‌తోపాటు ముగ్గురిపై కేసు నమోదు చేసి గురువారం వారిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం వారిని కోర్టులో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

దీప్తి.. ఘన కీర్తి

- పారా అథ్లెట్, కల్లెడ ముద్దుబిడ్డ దీప్తి జీవాంజికి అర్జున అవార్డు
- కుటుంబీకులు, ప్రజలు, క్రీడాభిమానుల హర్షం



జీవాంజి దీప్తి

పర్వతగిరి: పారా అథ్లెట్, వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన జీవాంజి దీప్తి.. ఘన కీర్తి సాధించారు. దేశంలోనే ప్రతిష్టాత్మక అర్జున అవార్డుకు ఎంపికయ్యారు. పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించడంతో భారత ప్రభుత్వం దీప్తిని ఈ అవార్డుకు గురువారంఎంపిక చేసింది. ఈనెల 17వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా దీప్తి ఈ అవార్డును అందుకోనున్నారు. దీనిపై జీవాంజి దీప్తితో పాటు ఆమె కుటుంబ సభ్యులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీవాంజి దీప్తికి అర్జున అవార్డు.. దివ్యాంగుల శక్తికి నిదర్శనం

జీవాంజి దీప్తికి అర్జున అవార్డు రావడం దివ్యాంగుల శక్తికి నిదర్శనమని స్టేట్ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ -వికలాంగుల విభాగం గౌరవ అధ్యక్షుడు ముత్తినేని వీరయ్య అన్నారు. ఈ మేరకు జీవాంజి దీప్తిని గురువారం ఆయన సన్మానించారు. పారాలింపిక్స్‌లో భారతదేశం తరఫున పాల్గొని కాంస్య పతకం సాధించిన జీవాంజి దీప్తి అర్జున అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జీవాంజి దీప్తిని పారా క్రీడాకారులు ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అర్జున అవార్డు రావడం అదృష్టంగా భావిస్తున్నాం..

మా కూతురు జీవాంజి దీప్తికి ప్రతిష్టాత్మక అర్జున అవార్డు రావడం అదృష్టంగా భావిస్తున్నాం.దీప్తిని చిన్నప్పుడు అందరూ అవహేళన చేసే వారు. ఈ అవమానాలను దిగమింగుకుంటూ కష్టపడి ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, కోచ్ నాగపురి రమేశ్, ఆర్డీఎఫ్ విద్యా సంస్థల చైర్మన్ రామ్మోహన్‌రావు సహకారంతో అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ స్థాయిలో పారా ఒలింపిక్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించింది. ఈరోజు అర్జున అవార్డుకు ఎంపికకావడం దీప్తి తల్లిదండ్రులుగా గర్వపడుతున్నాం.

-జీవాంజి ధనలక్ష్మి, యాదగిరి, దీప్తి తల్లిదండ్రులు

దీప్తిని స్ఫూర్తిగా తీసుకుని మరో అడుగు ముందుకు..



అర్జున అవార్డుకు ఎంపికైన జీవాంజి దీప్తిని స్ఫూర్తిగా తీసుకుని మరో అడుగు ముందుకు వేస్తా. ఆంధ్రాకు చెందిన అర్జున అవార్డు గ్రహీత వై.జ్యోతికి కోచ్‌గా వ్యవహరించా. దీప్తి, జ్యోతికి అర్జున అవార్డు రావడం అదృష్టంగా భావిస్తున్నా. వీరి స్ఫూర్తితో మరిన్ని అర్జున, ఖేల్‌రత్న, పద్మశ్రీ అవార్డులు పొందేందుకు విద్యార్థులకు చేయూతనందిస్తా. జీవాంజి దీప్తికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.కోటి నగదు, 500గజాల ఇంటి స్థలం, ఉద్యోగం కల్పించడం హర్షణీయం.

-నాగపురి రమేశ్, కోచ్

మారిన పుష్‌పుల్ రైళ్ల నంబర్లు..

- జనవరి 1 నుంచి అమలు
- రైల్వే బ్లాక్‌తో 6 రైళ్లు రద్దు.. 11 దారి మళ్లింపు



కాజీపేట రూరల్ : కాజీపేట, వరంగల్, డోర్నకల్, విజయవాడ, సికింద్రాబాద్ మధ్య ప్రయాణించే పలు పుష్‌పుల్ రైళ్ల నంబర్లు మారినట్లు కాజీపేట రైల్వే కమర్షియల్ అధికారులు గురువారం తెలిపారు. మారిన పుష్‌పుల్ ట్రైన్ నంబర్లు జనవరి 1వ తేదీ నుంచి అమలు చేసి నడిపిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

నంబర్లు మారిన రైళ్లు ఇవే..

కాజీపేట–డోర్నకల్ (పాత నంబర్ 07753/ కొత్త నంబర్ 67765) పుష్‌పుల్, డోర్నకల్–కాజీపేట (పాత నంబర్ 07754/కొత్త నంబర్ 67766) పుష్‌పుల్, కాజీపేట-సికింద్రాబాద్ (పాత నంబర్ 07757/ కొత్త నంబర్ 67764) పుష్‌పుల్, సికింద్రాబాద్–కాజీపేట (పాత నంబర్ 07758/ కొత్త నంబర్ 67763) పుష్‌పుల్, సికింద్రాబాద్–వరంగల్ (పాత నంబర్ 07462/ కొత్త నంబర్ 67761) పుష్‌పుల్, వరంగల్–సికింద్రాబాద్ (పాత నంబర్ 07463/కొత్త నంబర్ 67762) పుష్‌పుల్.

రైల్వే బ్లాక్‌తో పలు రైళ్ల రద్దు

కాజీపేట-విజయవాడ రూట్‌లో మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులతో పలు రైళ్లను రద్దు చేసి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలు

2024 డిసెంబర్ 25వ తేదీ నుంచి 2025 జనవరి 9వ తేదీ వరకు కాజీపేట–డోర్నకల్(07753) పుష్‌పుల్, డోర్నకల్–కాజీపేట (07754) పుష్‌పుల్, జనవరి 5,7,8,9వ తేదీన గుంటూరు–సికింద్రాబాద్ (12705) డైలీ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–గుంటూరు (12706) డైలీ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, జనవరి 4,7,8,9వ తేదీల్లో విజయవాడ–సికింద్రాబాద్ (12713) డైలీ శాతవాహన ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–విజయవాడ (12714) డైలీ శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లు రద్దయినట్లు అధికారులు తెలిపారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

జనవరి 8వ తేదీన విశాఖపట్నం–ఎల్‌టీటీ (18519) డైలీ ఎక్స్‌ప్రెస్, జనవరి 6,8వ తేదీల్లో షాలిమార్–హైదరాబాద్ (18045) ఎక్స్‌ప్రెస్, జనవరి 7,9వ తేదీల్లో హైదరాబాద్–షాలిమార్ (18046) ఎక్స్‌ప్రెస్, జనవరి 7వ తేదీన షిర్డీ–కాకినాడ (17205) ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం–షిర్డీ (17208) ఎక్స్‌ప్రెస్, జనవరి 8వ తేదీన కాకినాడ–షిర్డీ (17206) ఎక్స్‌ప్రెస్, షిర్డీ–మచిలీపట్నం (17207) ఎక్స్‌ప్రెస్, జనవరి 6,8వ తేదీల్లో ముంబాయి–భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–ముంబాయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, జనవరి 7వ తేదీన సికింద్రాబాద్–షాలిమార్ (12774) ఎక్స్‌ప్రెస్ రైళ్లను వరంగల్, కాజీపేట మీదుగా కాకుండా వయా విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

హమాలీలకు వేతనాలు, బకాయిలు చెల్లించాలి

- తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మునీశ్వర్



హన్మకొండ: హమాలీల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న జి.మునీశ్వర్

హన్మకొండ/ వరంగల్ : సివిల్ సప్లయ్ హమాలీ రేట్ల పెంపుపై కుదుర్చుకున్న ఒప్పందం మేరకు హమాలీలకు వేతనాలు, బకాయిలు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మునీశ్వర్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధనకు సివిల్ సప్లయ్ హమాలీలు నిరవధిక సమ్మె చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం హనుమకొండ గోకుల్ నగర్‌లోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద, వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లోని సివిల్ సప్లయ్ గోదాంల వద్ద దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను జి.మునీశ్వర్ ప్రారంభించి మాట్లాడుతూ 2024 అక్టోబర్ 4న సివిల్ సప్లయ్ కమిషనర్.. హమాలీల సమస్యలపై ఒప్పందం చేసుకున్నారని, మూడు నెలలు గడుస్తున్నా ఒప్పందం మేరకు జీఓ విడుదల చేయాల్సి ఉండగా కాలయాపన చేస్తూ హమీలకు నష్టం చేకూరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం హమాలీల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్, హమాలీ సంఘం నాయకులు కుక్కల మల్లయ్య, కొనుపుల భిక్షపతి, కన్నబోయిన కుమార్, బోయిని సమ్మయ్య, బోయిని కట్టయ్య, ఆకుల సుధాకర్, దామెర కృష్ణదేవర, రాంబాబు, చంద్రమౌళి, రవి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

- గొల్లచర్లలో ఘటన



ఉమ (ఫైల్)

డోర్నకల్ : అత్తింటి వేధింపులతో మండలంలోని గొల్లచర్లలో వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. డోర్నకల్ సీఐ బి.రాజేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ ఉమ(18) రెండు సంవత్సరాల క్రితం గ్రామంలోని వడ్డెర కాలనీకి చెందిన ఆలకుంట చంటిని ప్రేమ వివాహం చేసుకుంది. సంవత్సరం క్రితం పాప జన్మించినప్పటి నుంచి ఉమకు అత్తింటి నుంచి వేధింపులు మొదలయ్యాయి. భర్త చంటితోపాటు అత్త స్వప్న, మామ భద్రయ్య, ఆడపడుచు కావేరి వివిధ రకాలుగా వేధించ సాగారు. పలుమార్లు పంచాయితీ నిర్వహించినా గొడవలు కొనసాగుతుండడంతో ఉమ తన తల్లి వద్దకు వెళ్లింది. ఈ నేపథ్యంలో గత నెల 28న చంటి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అదే రోజు సాయింత్రం భర్తను చూసేందుకు ఉమ ఆస్పత్రికి వెళ్లగా అత్త, మామ, తదితరులు ఉమను తీవ్రంగా దూషించారు. దీంతో మనస్తాపానికి గురైన ఉమ పురుగుల మందు తాగి గొల్లచర్లలోని తన ఇంటికి వెళ్లి పడిపోయింది. కుటుంబీకులు వెంటనే ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు డోర్నకల్ పీఎస్‌లో కేసు నమోదు చేయగా మహబూబాబాద్ డీఎస్పీ విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడు..

శాయంపేట : మద్యం మత్తులో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం శాయంపేటలో జరిగింది. ఎస్సై జక్కుల పరమేశ్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అబ్బు భాస్కర్ రెడ్డి(33) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన భార్య రసన్య బోనాల పండుగకు తల్లిగారింటికి వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం మద్యం సేవించి మత్తులో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

ధర్మసాగర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం మండలంలోని ధర్మపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లక్కాకుల రాజు (44) కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ కుటుంబీకులతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం కూడా మద్యం తాగొచ్చి గొడవ పడ్డాడు. మత్తులో పురుగుల మందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి అనంతలోకాలకు..

- చెట్టును ఢీకొన్న కారు.. యువకుడి మృతి
- జనగామ జిల్లా కొడకండ్ల మండలంలో ఘటన
- చంపేసి కారు ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారని మృతుడి తండ్రి ఆరోపణ



సుమన్ (ఫైల్)

మరిపెడ రూరల్/కొడకండ్ల: ఓ యువకుడు బంధువు అంత్యక్రియలకు వెళ్లాడు. అక్కడ స్నేహితుతో కలిసి సరదాగా కారులో బయటకు వెళ్లి శవమయ్యాడు. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం డీఎస్‌ఆర్‌జిండాల్ తండా జీపీలోని కొమటికుంటతండాకు చెందిన బానోత్ సుమన్ (26) ఖమ్మం జిల్లా కాకరవాయిలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో జనవరి 1వ తేదీన తన మామ ఊరు మహబూబాబాద్ జిల్లా కేంద్రం ఇందిర కాలనీ సింగిలాల్‌తండాలో బంధువు అంత్యక్రియలకు వెళ్లాడు. అక్కడ బంధువులు ధరావత్ దేవాదాసు, ధరావత్ ప్రశాంత్, భూక్య వినోద్, మూడ్ వినోద్‌తో కలిసి కారులో అదే రోజు రాత్రి సరదాగా బయటకు వెళ్లారు. ఈ నేపథ్యంలో వీరు ప్రయాణిస్తున్న కారు జనగామ జిల్లా కొడకండ్ల మండలం రేగుల గ్రామ సమీపంలో ఓ చెట్టును ఢీకొంది. డ్రైవర్ పక్కన ముందు సీట్లో కూర్చున్న సుమన్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నలుగురు వ్యక్తులు సుమన్ మృతదేహాన్ని అదే కారులో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి తీసుకొచ్చారు. సింగిలాల్‌తండాలోని మృతుడి మామ ఇంటి ఎదుట పార్క్ చేసి పరారయ్యారు.

నా కొడుకును చంపేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారు

'పథకం ప్రకారమే నా కొడుకును నలుగురు కలిసి కారులో బలంతంగా బయటకు తీసుకెళ్లారు. అక్కడ ఏ జరిగిందో ఏమో కొడుకు శవాన్ని తీసుకొచ్చి నా బావమరిది ఇంటి వద్ద ఉంచి నలుగురు పరారయ్యారు' అని మృతుడి తండ్రి బానోత్ దేవుజా ఆరోపించాడు. పరారీలో ఉన్న వారికి ఫోన్ చేస్తే చెట్టుకు కారు ఢీకొందని, ఎదురుగా మరో కారు ఢీకొట్టడంతో దానిని వెంబడించామని పొంతన లేని సమాధానం చెబుతున్నారని, వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కన్నీటి పర్యంతమయ్యాడు. మృతుడికి భార్య అనసూర్య, 3 సంవత్సరాల కుమారుడు, ఏడాది కుమార్తె ఉన్నారు. కాగా, ఈ ఘటనపై మృతుడి తండ్రి దేవుజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొడకండ్ల ఎస్సై రాజు గురువారం తెలిపారు.

కూతురును చూసి తిరుగు ప్రయాణంలో మృత్యుఒడికి..

- ట్రాక్టర్, బైక్ ఢీ.. ఒకరి మృతి
- బావోజీ తండాలో ఘటన



లక్ష్మణ్ (ఫైల్)

పెద్దవంగర: తన కూతురు అమ్మమ్మ ఇంటివద్ద ఉండగా చూసేందుకు వచ్చాడు. బిడ్డతో సరదాగ కాసేపు ముచ్చటించాడు. తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్, స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం నిధానపురం గ్రామానికి చెందిన యాసాని లక్ష్మణ్ (38) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అత్తగారి గ్రామం ఇదే జిల్లా పెద్దవంగర మండలం చిన్నవంగరలో కూతురు హేమశ్రీ అమ్మమ్మ వద్ద ఉంటుంది. తన బిడ్డను చూసి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో పెద్దవంగర మండలం బావోజీ తండాకు చెందిన బానోత్ వెంకటేశ్ ట్రాక్టర్‌ను నడుపుతూ చిట్యాల నుంచి తన తండాకు చేరుకునే క్రమంలో బైక్‌పై వస్తున్న లక్ష్మణ్‌ను ప్రాథమిక పాఠశాల సమీపంలో ఢీకొన్నాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందజేశారు. తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సునీత, కూతురు హేమశ్రీ ఉన్నారు. మృతుడి తండ్రి పరశురాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మారుకా మచ్చల పురుగుతో జాగ్రత్త..

- కంది పంటను ఆశిస్తున్న పురుగు
- యాజమాన్య చర్యలు చేపట్టాలి
- డీఏఓ ఎం.విజయనిర్మల

మహబూబాబాద్ రూరల్ : రైతులు సాగు చేసే అపరాలలో కంది ముఖ్యమైన పంటకాగా ప్రస్తుతం పూత, పిందే దశలో ఉంది. ఈ తరుణంలో మారుకా మచ్చల పురుగు ఆశిస్తుందని, సకాలంలో యాజమాన్య చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయనిర్మల అన్నారు. కందిలో ఆశించే ముఖ్యమైన చీడపీడలలో మరుకా మచ్చల పురుగు ముఖ్యమైందని, రైతులు సకాలంలో పురుగు ఉధృతిని గమనించి యాజమాన్య పద్ధతులు పాటించి పంటను రక్షించుకోవాలని వివరించారు.

పురుగు లక్షణాలు..

- మారుకా మచ్చల పురుగు మొగ్గ, పూత దశలో ఆశించి ఎక్కువ నష్టం కలుగజేస్తుంది. పూత దశలో పూలను గూడుగా చేసి లోపలి పదార్థాలను తింటుంది.
- కాయలు తయారయ్యేటప్పుడు దగ్గరకుచేర్చి గూడు కట్టి, కాయలకు రంధ్రం చేసి లోపలి గింజలను తినడం వల్ల పంటకు ఎక్కువ నష్టం కలుగుతుంది.
- గూడు దగ్గర లార్వా విసర్జితాలు కనిపిస్తాయి. గూళ్లు విప్పినప్పుడు తెల్లపు వర్ణం కలిగిన పిల్ల పురుగులను గమనించొచ్చు.
- ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పూత గెల బూజుగా మారుతుంది.



కంది పంటను ఆశిస్తున్న మారుకా మచ్చల పురుగు

అనుకూల పరిస్థితులు..

పూత దశలో మేఘావృతమైనప్పుడు, పొగ మంచు, అడపాదడపా చిరుజల్లులు కురిసినప్పుడు, ఈ పురుగు ఉధృతికి కారణమయ్యే అనుకూలమైన పరిస్థితులు.

యాజమాన్య చర్యలు..

పూతదశలో తప్పనిసరిగా పైరుపై 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనె (1500 పీపీఎం) 5 మిల్లీ లీటర్లను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే రెక్కల పురుగులు గుడ్లు పెట్టడానికి ఇష్టపడవు. అంతేకాక అప్పటికే పంట మొక్కలపై ఉన్న గుడ్లు కూడా పగిలి చనిపోతాయి.

మొగ్గ పూత దశలో అక్కడక్కడ కొన్ని మొగ్గలను సేకరించి వాటిని తెరిచి పిల్ల పురుగులు ఉన్నాయెమోనని పరిశీలించాలి. పిల్ల పురుగులు గమనిస్తే వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా నోవాల్యురాన్ 0.75 మిల్లీ లీటర్లను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

పురుగు ఉధృతి అధికంగా గమనించినప్పుడు స్పైనోశాడ్ 0.3 మిల్లీ లీటర్లు లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మిల్లీ లీటర్లు లేదా క్లోరాంట్రానిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు లేదా లాంబ్డాసైహాలో త్రిన్ 1 మిల్లీ లీటర్‌ను లీటర్ నీటికి కలిపి పైరుపై పిచికారీ చేసినట్లయితే ఫలితం ఉంటుంది.